## చెకుముఖి సంబురాల పోస్టర్ ఆవిష్కరణ



మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 18 : చెకుముఖి సైన్స్ సంబురాల్లో విద్యార్థులను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక చెకుముఖి సంబరాలు-2024 పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఈఓ విజయకుమారి, జేవీవీ నాయకులు బీఎన్ రెడ్డి, శ్రీనివాస్, జన్సీ, రాంమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను శిక్షించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేశ్ రాథోడ్

మేడ్చల్, అక్టోబరు 18 : విద్యార్థులను శిక్షించిన మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు గ్రామ పరిధిలోని పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ రాథోడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫీజులు కట్టలేదని, ఇంటి పని చేయలేదని విద్యార్థులను చొక్కాలు విప్పించి, మోకాళ్లపై కూర్చొపెట్టిన పూడూరులో సెయింట్ మేరీస్ పాఠశాల గుర్తింపును రద్దు చేసి, క్రిమినల్ కేసు పెట్టాలన్నారు. జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణ లేని కారణంగా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే విద్యార్థులను శిక్షించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్యామ్‌రావు, మనీశ్, రాహుల్, దినేశ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, అక్టోబర్ 18: పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నేరేడ్‌మెట్‌కు చెందిన విఘ్నేశ్‌కు రూ. 60వేలు, రాజ్‌కిరణ్‌కు రూ. 28.500వేలు మంజూరు కాగా ఆ చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్కాజిగిరిలోని ప్రభుత్వ దవాఖానలో ప్రైవేటుకు దీటుగా మెరుగైన వైద్య సేవలందుబాటులో ఉన్నాయన్నారు. బస్తీ దవాఖానాల్లోనూ చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యాక్రమంలో ఏంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, రావుల అంజయ్య, కరంచంద్, జీకే హన్మంతరావు, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే**

పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఏఆర్ ఫర్ ఎర్త్ సంస్థ 19న పాఠశాలల విద్యార్థులతో నిర్వహించనున్న సమావేశానికి రావాలని ఆ సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఆహ్వానించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ఏంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ జెండా.. కార్యకర్తలకు అండ

- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- కార్యకర్త కుటుబానికి పార్టీ జీవిత బీమా చెక్కు అందజేత



ఘట్‌కేసర్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ. 2 లక్షల పార్టీ జీవిత బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబర్ 18 : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మె ల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త డి.రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దాంతో ఆయనకు పార్టీ రూ. 2లక్షల జీవితబీమా మంజూరైంది. శుక్రవారం ఘట్‌కేసర్ క్యాంపు కార్యాలయంలో రమేశ్ భార్య రజితకు ఎమ్మెల్యే మల్లారెడ్డి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించే పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనని అన్నారు. పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే బీఆర్ఎస్ బీమా సౌకర్యం కల్పిస్తుందని పేర్కొన్నారు. అందజేశారు. బీఆర్ఎస్ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం తన మనవరాలి వివాహానికి రావాలని ఇక్కడి నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే వివాహ పత్రికను అందజేశారు.

## రోడ్డు మరమ్మతులకు మంత్రికి వినతి



శామీర్‌పేట, అక్టోబర్ 18 : రోడ్డు సమస్యను పరిష్కరించాలని లక్ష్మాపూర్ వాసి క్యాతం మధుకృష్ణ మంత్రి కోమటిరెడ్డిని కోరారు. శుక్రవారం మంత్రిని కలిసి రోడ్డు సమస్యను వివరించారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్-కొట్యాల్ రోడ్డు మరమ్మతులు చేసి బీటీ రోడ్డు వేయాలని కోరారు. లక్ష్మాపూర్ రాములగుట్ట-కొట్యాల్ రోడ్డు మంజూరైనప్పటికీ పనులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు.

# ఏసీటీలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ గౌతమ్ పొట్రు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్ పొట్రు, అధికారులు


మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబరు 18 : అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్(ఏసీటీ)లపై జిల్లాలోని విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ గౌతమ్ పొట్రు సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ఏసీటీలపై ఎల్ఈటీ అండ్ ఎఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏసీటీల ద్వారా లబ్ధి పొందేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్న మేడ్చల్, అల్వాల్ ఐటీఐల్లో ఏర్పాటు చేసిన ఏసీటీల్లో వివిధ రకాల కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూ డాలన్నారు.

అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మ్యాచినింగ్ టెక్నిషియన్ సెక్టార్- క్యాపిటర్ గుడ్ సాండ్ మ్యాను ఫ్యాక్చరింగ్ కోర్సులో (రెండేళ్లు) 24 సీట్లు,ఆర్టిషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ సెక్టార్ క్యాపిటర్ గూడ్స్ అండ్ ఏఎంపీ కోర్సులో 20 సీట్లు(ఏడాది), బేసిక్ డిజైన్ అండ్ వర్చువల్ వెరిఫైడ్ మెకానికల్ కోర్సులో 24 సీట్లు(రెండేళ్లు), డిజిటల్ మ్యాను ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సులో 40 సీట్లు(ఏడాది), మెకానిక్ ఎల్కట్రికల్ వెహికిల్ కోర్సులో 24 సీట్లు(రెండేళ్లు),మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ కోర్సులో 40 సీట్లు(ఏడాది) అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనా అధికారి తదితరులు పాల్గొన్నారు.

## నీవు లేకుండా నేను ఉండలేకపోతున్న...

# వీడియోకాల్ చేసి భర్త బలవన్మరణం

- ట్రాన్స్‌జెండర్‌గా మారి కుటుంబాన్ని మోసం చేశానని మనస్తాపం



మృతిచెందిన సంతోష్ అలియాస్ సరిత(ఫైల్)

జవహర్‌నగర్, అక్టోబర్ 18: నీవులేక నేను ఉండలేకపోతున్న.. ట్రాన్స్‌జెండర్‌గా మారి నేను నిన్ను మోసం చేశా..నని మన స్తాపం చెందిన భర్త భార్యకు వీడియో కాల్ చేసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి దివ్యాంగులకాలనీ రేణుకానగర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం... బాలాజీనగర్ సంతోష్‌నగర్‌కాలనీలో దొంతి సంతోష్(31) భార్య బాల మణి, కుమారుడితో కలిసి ఉంటున్నాడు. 2012లో ఆ దంపతులకు వివాహం కాకు కుమారుడు యేగేశ్వర్(8) ఉన్నాడు. అయితే నాలుగేండ్ల క్రితం సంతోష్ ట్రాన్స్‌జెండర్‌గా మారి సరితగా పేరు మార్చుకున్నాడు. అప్పటి నుంచి కుటుంబానికి దూరంగా రేణుకానగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ అప్పుడప్పుడే వచ్చి వెళ్తుండేవాడు. దాంతో భార్య కుమారిడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయి కుషాయిగూడలోని తల్లితో కలిసి ఉంటు న్నది. శుక్రవారం ఉదయం భర్త సంతోష్‌కు ఫోన్ చేసి మాట్లాడింది. ఈ క్రమంలో సంతోష్ అలియాస్ సరిత తన భార్య బాలమణితో వీడియో కాల్ చేసి మాట్లాడుతూ.. నీవు లేక నేను ఉండలేకపోతున్నా... నేను నిన్ను మోసం చేశానని బాధపడుతూ.. వెంటనే రావాలని లేకుంటే చనిపోతానని చెప్పాడు. వెంటనే భార్య బాల మణి ఫోన్ కట్‌చేసి చుట్టుపక్కలవారికి చెప్పింది. ఇరుగుపొరుగువారితో వెళ్లి చూసే సరికి సంతోష్ చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలి



ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

మేడ్చల్, అక్టోబరు 18 : విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగి, పది మందికి ఉపాధి చూపించే స్థాయికి ఎదగాలని గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామిరెడ్డి అన్నారు. కళాశాలలో ఐఐటీ ఖరగ్‌పూర్, క్రాఫ్టస్ సంస్థలతో కలిసి రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతపై పట్టు సాధించి, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలన్నారు. తమ ఆలోచనలను కార్యారూపంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన పెట్టుబడి, వనరులను సమకూర్చుకునే అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ది రినైసాన్స్ సంస్థ సహ వ్యవస్థాపకుడు సాయిగణేశ్, గ్లోబల్ కార్బన్ వారియర్స్ సంస్థ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్, హైదరాబాద్ ఏంజెల్స్ సంస్థ పెట్టుబడి సంచాలకుడు, సీఈవో రత్నాకర్ సామవేదం, అఖిల భారత రోబోటిక్ సమితి ముఖ్య రెవెన్యూ అధికారి సిద్ధార్థ మాట్లాడారు. అంకుర సంస్థలు నెలకొల్పేందుకు విద్యార్థులకు మనోధైర్యం, ఆత్మ విశ్వాసం అవసరమన్నారు. రోజుకు 18 గంటలు కష్టపడుతూ.. పలు రకాల వ్యక్తులతో సమావేశం కావాలన్నారు. ప్రజల అవసరాలు తీర్చాలని, వారి అభిరుచికి తగ్గట్టు ఉత్పత్తులు ఉండాలని సూచించారు. సదస్సులో 1500 మంది విద్యార్థులు హాజరు కాగా సమన్వయకర్తలు డాక్టర్ సరిత, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నితిన్ వర్మ, ఉదయ్ భాస్కర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డాక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌కు సన్మానం



రామంతాపూర్,అక్టోబర్ 18 : తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తంను శుక్రవారం ఓయూ ఉద్యోగ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. యునివర్సిటీ సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బి. కుమార్, ఖాదిర్‌ఖాన్,జి. నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీఏ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు



ఘట్‌కేసర్, అక్టోబర్ 18 : భవిష్యత్‌లో ఎంబీఏ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉపాధి అవకాశాలు అధికంగా ఉండే ఎంబీఏ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి జ్యోతి వెలిగించి 2023-24 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగం డీన్ డాక్టర్ టీ. రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలి




మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ మాణిక్యంరెడ్డి

శామీర్‌పేట, అక్టోబర్ 18 : నిబంధనలకు నీళ్లొదిలే సంప్రదాయాన్ని కొనసాగిస్తే సహించేది లేదని వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ ప్రధాన సంపాదకుడు (టీఎస్‌యూటీఎఫ్) పి.మాణిక్యంరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మూడుచింతలపల్లి మండల లక్ష్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా స్థాయి కౌన్సిల్ సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ బదిలీల్లో సాంకేతిక సమస్యల మూలంగా ఒక పాఠశాలకు బదులు వేరొక పాఠశాలకు కేటాయించబడి ఇబ్బందులు పడుతున్న వందలాది టీచర్ల అప్పీళ్ళను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 900 కిలోమీటర్ల దూరంలో ఉన్న ములుగు జిల్లాల నుంచి మేడ్చల్ జిల్లాకు డిప్యూటేషన్‌పై ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు. బదిలీ అప్పీళ్ళపై తప్పుడు సంప్రదాయాన్ని తెరలేపే ప్రమాదం ఉందని తక్షణమే ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జయసంహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మధన్‌రెడ్డి, దేవజనాయక్, తిరుమలేశ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కీసర, అక్టోబర్ 18 : నాగారం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయలయ్యాయి. కీసర పోలీసుల కథనం ప్రకారం.. కీసర మండలం నాగారం మున్సిపల్ పరిధిలో మౌలాలికి చెందిన అనూష్(16) ద్విచక్ర వాహనంపై కీసర వైపు వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో వాహనం అతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో బాలుడి కాలు విరిగింది. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఈసీఐఎల్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. కీసర పోలీసులు కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, డీసీవో వెంకట్‌రెడ్డి

శామీర్‌పేట, అక్టోబర్ 18 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయదారులు సేవా సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి, డీసీవో వెంకట్‌రెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్, కేశవరం, ఉద్దెమర్రి గ్రామాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేశ్, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్యాయాదవ్, సీఈవో నర్సింహులు, కార్యదర్శి శోభారాణి, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన చంద్రశేఖర్ (ఫైల్)

పీర్జాదిగూడ, అక్టోబర్ 18: ఇంటినుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. బోడుప్పల్ కార్పొరేషన్ టెలిఫోన్ కాలనీలో నివాసం ఉం టున్న మల్లీడు చంద్రశేఖర్ (39) స్థానికంగా బేకరీ షాపు నిర్వహిస్తున్నాడు. ఈనెల 15న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. బంధువులను ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తల్లీ కూతురు మధ్య గొడవ.. పోలీసులను ఆశ్రయించిన బాలిక

మల్కాజిగిరి, అక్టోబర్ 18: తల్లీ, కూతుళ్ల పంచాయితీ పోలీస్‌స్టేషన్ వరకు వచ్చింది. ఈ ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రహుల్‌దేవ్ కథనం ప్రకారం.. అల్వాల్‌కు చెందిన నగినకు 16 ఏండ్ల కూతురు(మైనర్) ఉన్నది. గత కొన్ని రోజులుగా ఆ బాలికను తల్లి నానా మాటలతో వేధిస్తూ.. చెప్పిన మాటలు వినడంలేదని చిత్రహింస పెడుతోంది. తల్లి చెడు పనులు చెప్పడంతో ఆగ్రహించిన ఆ బాలిక పోలీసులను ఆశ్రయించింది. బాలిక నుంచి వివరాలు సేకరించిన పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. బాలికతో పాటు పీఎస్‌కు వచ్చిన తల్లి.. నా కూతుర్ని నాతో పంపించాలి.. మీకు ఏ హక్కు ఉన్నదని నన్ను ప్రశ్నిస్తున్నారు.. అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగింది. విధులకు ఆటంకం కల్పించడంతో తల్లిపై పోలీసులు కేసు నమోదు చేశా రు. కూతుర్ని వేధించడం, విధులకు ఆటంకం కల్పించడంతో పోలీసులు తల్లిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

## నేడు ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఖోఖో టోర్నమెంట్

శామీర్‌పేట, అక్టోబరు 18 : ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఖోఖో టోర్నమెంట్ శామీర్‌పేట మినీ స్టేడియంలో శనివారం నిర్వహించనున్నట్టు ఎస్‌జీఎఫ్ జోనల్ కార్యదర్శి గుర్ర సత్తిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 8 జోన్‌లు ఉండగా ఒక్కో జోన్ నుంచి నాలుగు టీంలు చొప్పున 32 టీంలు పాల్గొంటాయన్నారు.

# మెరుగైన వైద్యసేవలందించే ఆవిష్కరణలు చేయాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఓటోలరింగాలజిస్ట్ సౌత్‌జోన్ ప్రతినిధులు

శామీర్‌పేట, అక్టోబరు 18 : ప్రజలకు మెరుగైన సేవలందించే ఆవిష్కరణలు చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వైద్యులకు సూచించారు. ఈఎన్‌టీలో ఆధునాతన పురోగతులపై చర్చించేందుకు శామీర్‌పేటలోని అలంకృత రిసార్ట్స్‌లో సౌత్‌జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్‌ను 'బేసిక్స్ అండ్ బియాండ్' పేరుతో ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్ జోన్ అసోసియేషన్(ఏవోఐ ఎస్‌జెడ్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో వైద్య సేవలు, శస్త్ర చికిత్సల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువాలన్నారు. పరిజ్ఞానాన్ని ఒకరికొకరు బదిలీ చేసుకొని, నూతన విధానాల ఆవిష్కరణకు నాంది పలకాలన్నారు. ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్ జోన్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ డీఎస్ దీన్ దయాళ్ మాట్లాడుతూ.. ఈఎన్‌టీ చికిత్సలో ఎన్నో మార్పులు వచ్చాయని, కృత్రిమ మేధతో ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మకమైన మార్పులు రాబోతున్నాయన్నారు. కార్యదర్శి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నర్వ్ స్టిమ్యులేషన్ వంటి కొత్త చికిత్సలను ప్రదర్శించడానికి, వివిధ అలర్జీలకు ఆధునాతన చికిత్సలపై ఈ సదస్సులో చర్చించనున్నట్టు తెలిపారు.

సదస్సులో సమన్వయకర్త డాక్టర్ ద్వారకానాథ్, కాళోజీ నారాయణ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వీసీ కరుణాకర్‌రెడ్డి,ఆంధ్రప్రదేశ్,తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన 1000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిత్యం తల్లిదండ్రుల ఘర్షణ..

# మనస్తాపంతో కుమారుడు ఆత్మహత్య

జవహర్‌నగర్, అక్టోబర్ 18: నిత్యం తల్లిదండ్రులు ఘర్షణ పడుతుండటంతో మనస్తాపం చెందిన కుమారుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి శ్రీరామ్‌నగర్‌కాలనీలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం... బాలాజీనగర్ పరిధి శ్రీరామ్‌నగర్‌కాలనీలో రేపని స్వామి(22) కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. స్వామి వైఫై కనెక్షన్లు ఇచ్చే సంస్థలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. స్వామి తల్లిదండ్రులు సిద్దయ్య, లక్ష్మి, నిత్యం ఇంట్లో గొడవ పడుతుండగా సర్ది చెప్పేవాడు. ఈనెల 17న పనికివెళ్ళిన స్వామి ఇంటికి తిరిగివచ్చేలోగా తల్లిదండ్రులు గొడవ పెట్టుకున్నారు. గమనించిన స్వామి వారికి సర్దిచెప్పి రాత్రి భోజనం చేయకుండానే గదిలోకి వెళ్లి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం నిద్రలేపడానికి తల్లిదండ్రులు ప్రయత్నించగా తలుపులు తీయలేదు. వెంటనే చుట్టుప్రక్కలవారి సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా స్వామి అప్పటికే ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## కళా ఉత్సవాల్లో తూంకుంట జడ్పీ విద్యార్థుల ప్రతిభ

శామీర్‌పేట, అక్టోబర్ 18 : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడా, నృత్య, సామాజిక కార్యక్రమాలపై అవగాహన అవసరమని ఎంఈవో, తూంకుంట జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి అన్నారు. మేడ్చల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన కళా ఉత్సవ పోటీల్లో తూంకుంట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని మొదటి స్థానం పొందారు. శుక్రవారం పాఠశాలలో విద్యారులు సాయిహర్షిత, సంధ్య, పార్వతి, అనుష్క, శిరీష, విద్యా వాలంటరీ రవిని ఘనంగా సన్మానించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయిలో ఈ విద్యార్థులు రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

# చికిత్స పొందుతూ యువతి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని దవాఖాన ఎదుట బంధువుల ఆందోళన



మృతిచెందిన నిఖిత(ఫైల్)



ప్రైవేటు వైద్యశాల ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న మృతురాలి బంధువులు

చర్లపల్లి,అక్టోబర్ 18 : వైద్యుల నిర్లక్ష్యంతో యువతి మృతి చెందిందని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు ప్రైవేట్ దవాఖాన ఎదుట ఆందోళన చేపట్టారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాద్రాది భువనగిరి జిల్లా మాదాపూర్ గ్రామానికి చెందిన నిఖిత(23) మేడిపల్లిలో కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటూ చదువుకుంటున్నది. గురువారం నిఖితకు ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను కాప్రా సర్కిల్ పరిధి ఈసీఐఎల్ చౌరస్తా కమలానగర్‌లోని ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు.

వైద్య సేవల అనంతరం వైద్యులు నిఖిత మృతి చెందిందని కుటుంబ సభ్యులకు తెలిపారు. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు పెద్ద ఎత్తున వైద్యశాలకు తరలివచ్చి నిఖిత మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని పేర్కొంటూ వైద్యశాల ఎదుట బైఠాయించారు. వైద్యశాలకు నడుచుకుంటూ వచ్చిన నిఖిత వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని ఆరోపించారు. మెడికల్ మాఫియాపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, నిఖిత మృతికి కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని బంధువులు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో వైద్యశాల వద్ద ఉద్రిక్త వాతవరణం నెలకొనడంతో వెంటనే పోలీసులు చేరుకొని వైద్యశాల యాజమాన్యం, మృతురాలి బంధువులతో చర్చించి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంఎంటీఎస్ రైళ్లు సమయానికి నడపండి..



మల్కాజిగిరి, అక్టోబర్ 18: ఎంఎంటీఎస్ రైళ్లు సమయానికి నడపాలని ప్రయాణికుల సంఘం ప్రధాన కార్యదర్శి నూర్ అన్నారు. ఎంఎంటీఎస్ రైళ్లు సమయానికి నడపాలని కోరుతూ శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం లోకేశ్ విష్ణోయ్, హైదరాబాద్ రైల్వే డీఆర్ఎం బర్తేశ్‌కుమార్ జైన్‌లకు ఆయన వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూర్ మాట్లాడుతూ బొల్లారం సెక్షన్‌లో 9, 12 బోగీలతో నడుస్తున్న వాటిని 6 బోగీలకు కుదించి రైళ్ల సంఖ్యను పెంచాలన్నారు. ఆనంద్ బాగ్, లయోలా కాలేజీ వద్ద రైల్వే స్టేషన్‌లను నిర్మించాలని కోరారు. సంఘం నాయకులు మహేందర్‌రెడ్డి, శాస్త్రి, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కోకన్వీర్‌గా శ్రీనివాస్

మల్లాపూర్ : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మీడియా విభాగం రాష్ట్ర కోకన్వీనర్‌గా మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు చెందిన దాసారం శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు దాసారం శ్రీనివాస్‌కు ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ నియామకపత్రాన్ని అందజేశారు.

**PUBLIC NOTICE**

The general public are hereby informed that Mrs. Mannem Bhagyalaxmi W/o. Mr. Mannem Bhaskar Reddy is proposing to mortgage the below mentioned property in favor of my client RBL Bank Ltd., having one of its office at Ameerpet, Hyderabad, in order to avail a loan facility. That the said mortgager represented that he had lost the one of the original link documents No.1653/1995 pertaining to the said property. He further represented that the where abouts of the said original document is not yet traced and thus not in a position to give the custody in favour of my client. If anybody has any claim. right, title, interest or objections whatsoever in respect of the said property may contact the undersigned in the below mentioned address with all relevant documents within 7 days from the date of publication of this notice. In case, no objections are received my client will proceed further and accept the mortgage. The claims thereafter if any shall not be entertained.

**SCHEDULE OF PROPERTY**

All that the Plot bearing No.570 admeasuring 200.0 Sq. Yards or 167.2 Sq. Meters in Sy. No. 6 & 7 known as Kancha Salarjung, situated at Sai Priya Nagar, Parvathapur Village & GP, Ghatkesar Mandal, Ranga Reddy District and bounded by:- North: Plot No.569, South: Plot No.571, East: Plot No. 573, West: 60' Wide Road.

Sd/- **K RAJA GOPAL REDDY,**
& Associate Advocates.
Flat No. 105, Sai Swaroop Apartments, Lane beside to Hotel Central Park
Hyderaguda, Hyderabad -29.
**Ph: 040-23210728, 9866313940**